'హిమోఫిలియా' ప్రాణాంతకం కాదు



మాట్లాడుతున్న మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ

కరీంనగర్‌టౌన్: హిమోఫిలియాతో ప్రాణానికి ఎలాంటి ప్రమాదం జరగదని, ఇలాంటి వ్యాధితో బాధపడే వారికి అందరూ సహాయం చేయడం ఒక సామాజిక బాధ్యత అవుతుందని ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. ప్రపంచ హేమోఫిలియా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కరీంనగర్ మాతాశిశు ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. హిమోఫిలియా వ్యాధిగ్రస్తులకు ఆసుపత్రిలో వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, ఆర్ఎంవో డాక్టర్ నవీన, డాక్టర్ బండి సుమన్, డాక్టర్ డి.రమణ, డాక్టర్ జె.ఉదయ్‌రాజ్, మురళీకృష్ణ, శ్రీనివాస్, హరీశ్, మహేష్, ముత్యాల విజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజం కోసం తపించిన వ్యక్తి 'ఆర్‌బీవీఆర్‌ఆర్'


ఆర్‌బీవీఆర్‌ఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కృష్ణారెడ్డి

కరీంనగర్‌టౌన్: సమాజం కోసం తపించిన మహనీయుడు, విద్యాదాత, స్ఫూర్తి ప్రదాత రాజబహద్దూర్ వెంకటరాంరెడ్డి అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి కొనియాడారు. ఆర్‌బీవీఆర్ ఆర్ రెడ్డి 71వ వర్ధంతి సందర్భంగా ఆర్‌బీవీఆర్‌ఆర్ కూడలిలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజంలో మెరుగైన మార్పు సాధ్యమని, సొంత నిధులతో విద్యా సంస్థలు నెలకొల్పి ఎందరికో విద్యాప్రదాతగా నిలిచిన మహానుభావుడని అన్నారు. జీవితాంతం పేదల అభ్యున్నతి కోసం పాటుపడిన నిరాడంబర వ్యక్తి, ఈ తరానికి స్ఫూర్తి దాయకమన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు పాల్గొన్నారు.

నగరంలో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం


ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోడూరి, కార్పొరేటర్ పద్మ తదితరులు

కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా ఆ పార్టీ నాయకులు గురువారం నగరంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 7వ డివిజన్ హౌసింగ్‌బోర్డుకాలనీలో సమన్వయ కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్, కార్పొరేటర్ ఆకుల పద్మ, మాజీ కౌన్సిలర్ ఆకుల ప్రకాశ్‌లు ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెండ్యాల నరసింహచారి, ఆకుల ఉదయ్, వాసాల హరీశ్, సుఫియాన్, అమీర్, తన్వీర్ తదితరులు పాల్గొన్నారు. కాగా నగరంలోని చైతన్యపురిలో వెలిచాల రాజేందర్‌రావు కూతుళ్లు రచన, రితికతో కలిసి కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ప్రచారం చేశారు. నాయకులు సత్యనారాయణరెడ్డి , శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

'గోవా బ్యాచ్' షూటింగ్ ప్రారంభం


షూటింగ్‌లో నటీనటులు

కరీంనగర్‌కల్చరల్: ఉప్పు క్రియేషన్స్ బ్యానర్‌పై సీనియర్ జర్నలిస్టు అయిలు రమేశ్ దర్శకత్వంలో ఉప్పు రవీందర్ నిర్మిస్తున్న 'గోవా బ్యాచ్' చిత్రం షూటింగ్ గురువారం గోవాలో ప్రారంభమైంది. ఈ చిత్రంలో ఉప్పు రవీందర్, కలర్ సత్యన్న, సుధాకర్ చొప్పరి, కనవేని శ్రీనివాస్, బాలకృష్ణ, సాహితీ, కీర్తి స్పందన, శ్రీలత నేత, ఉమ, కవిత, మౌనిక, మురళీ తదితరులు నటిస్తున్నారు. చిత్రానికి కెమెరా బాలకిషన్ తిప్పర వేణి, మేకప్ అశోక్ శ్రీరామోజు, ఎడిటింగ్ శివ, రచన సహకారం శివ తారక్, నిర్మాత ఉప్పు రవీందర్, కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వం అయిలు రమేశ్ వ్యవహరిస్తున్నారు.

బీజేపీలో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ సంజయ్

కరీంనగర్‌టౌన్: చొప్పదండి నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ సర్పంచులు గురువారం కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో బీజేపీలో చేరారు. వీరికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ బండి సంజయ్ కుమార్ కాషాయ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు


మద్దతు తెలుపుతున్న ఎంఐఎం నాయకులు

విద్యానగర్(కరీంనగర్): పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఎంఐఎం పార్టీ మద్దతు ప్రకటించింది. గురువారం ఎంఐఎం పార్టీ కరీంనగర్ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఎంఐఎం పార్టీ నాయకులతో కలిసి చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని కలిసి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు ఇమ్రాన్ అడ్వకేట్, ముఖీమ్, ఇమ్రాన్, కలీం, నసీర్, ఖాలీద్, జాకీర్, నాయబ్, షాకిర్, అఫ్సాన్, శబర్, అలీ, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై న్యాయం చేయండి

కరీంనగర్: చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలోని సర్వే నం.936లో 2 ఎకరాల 36 గుంటల భూమిని 54 ఏళ్లుగా కాస్తుకు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, తమ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తున్న వారిని కట్టడి చేయాలని షేక్ పాషా బేగం కోరారు. గురువారం ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 54 ఏళ్లుగా తమ పేరిట ఉన్న భూమిపై కన్నేసిన ఓ నాయకుడు రెవెన్యూ, పోలీసు అధికారులను తప్పుదోవ పట్టించి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. ఈ భూమిలో మేము వేసుకున్న పంటలు నష్టపోయినప్పుడు ప్రభుత్వం నుంచి మాకు పంట నష్టపరిహారం వచ్చిందని, అలాగే ఈ భూమిపై ఇందుర్తి బ్యాంకులో పంట రుణం తీసుకోగా ఇటీవల ప్రభుత్వం మాఫీ చేసిందని అన్నారు. ఖబ్రాస్తాన్‌లో కలుపుతామని, భూమిని కాజేసే ప్రయత్నం చేస్తున్న వారి నుంచి కాపాడాలని కోరారు.

పది ఫలితాల్లో చామనపల్లి హ్యాట్రిక్

- మూడో పర్యాయం వందశాతం ఉత్తీర్ణత
- చామనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

కరీంనగర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలంటే చిన్నచూపున్న తల్లిదండ్రులకు చామనపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థులు కనువిప్పు కలిగించారు. ప్రైవేట్ విద్యార్థులకు దీటుగా వరుసగా మూడో పర్యాయం వందశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చారు. గతనెలలో రిటైరైన ప్రధానోపాధ్యాయుడు కోట లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక తరగతులకు సరైన ఫలితం దక్కింది. మొత్తం 36 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా వీణ 9.8 జీపీఏ సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది. ఉత్తమ జీపీఏ సాధించిన విద్యార్థులను గురువారం ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ అబ్దుల్ బాసిత్‌పాటు ఉపాధ్యాయులు అభినందించారు. ఉత్తమ జీపీఏ సాధించిన విద్యార్థుల అభిప్రాయాలు వారి మాటల్లో..

కలెక్టర్ కావాలనుంది



తల్లిదండ్రులు కూలీ పనిచేస్తూ ఎంతో కష్టపడి చదివించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు ఉపాధ్యాయులు ప్రణాళిక ప్రకారం విద్యాబోధన చేయడంతో పాఠశాల టాపర్‌గా వచ్చా. భవిష్యత్‌లో కలెక్టర్ కావాలనే లక్ష్యంతో చదువుతా. – కె.వీణ, 9.8జీపీఏ

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌నవుతా



ఉపాధ్యాయులు అందించిన తోడ్పాటుతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంది. బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తా. – లింగంపల్లి శ్రావ్య, 9.7 జీపీఏ

ఐపీఎస్ సాధిస్తా



ఐపీఎస్ ఆఫీసర్ కావాలనే లక్ష్యంతో ఎస్సెస్సీ నుంచే మంచిగా చదువుతున్నా. ఉన్నత చదువులు చదివి ఐపీఎస్ సాధిస్తా. – వి.విఖిత, 9.5 జీపీఏ

ఎంపీ 'బండి'కి మతిభ్రమించింది


మాట్లాడుతున్న వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్: ఎంపీ బండి సంజయ్‌కి మతిభ్రమించిందని, ఎన్నికల్లో ఓటమి తప్పదని గ్రహించిన 'బండి' ఇష్టారాజ్యంగా ఆరోపణలు చేస్తున్నాడని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు మండిపడ్డారు. గురువారం ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెలిచాల రాజేందర్‌రావు మాట్లాడుతూ మ్యాచ్ ఫిక్సింగ్‌కి బండి సంజయ్ బ్రాండ్ అంబాసిడర్ లాంటివాడని, తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు ఎంతకైనా దిగజారే వ్యక్తి బండి అని ధ్వజమెత్తారు. మాజీ డీజీపీ ప్రభాకర్ రావుతో తనకు సంబంధాలు ఉన్నాయని బండి సంజయ్ చేస్తున్న ఆరోపణలను ఖండించారు. తన కుటుంబ జీవితం గురించి కరీంనగర్ మొత్తం తెలుసునని, చిన్న మచ్చ మరకలేని కుటుంబం కావడంతో తనకు కాంగ్రెస్ పార్టీ ఎంపీ సీటును ఇచ్చిందని స్పష్టం చేశారు. డీసీసీ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఫోన్ టాపింగ్‌కు తెర తీసిందే బీజేపీ అని, కేసీఆర్ బీజేపీతో అనుకూలంగా ఉండేందుకే ఫోన్ టాపింగ్ ప్రక్రియ నిర్వహించారని ఆరోపించారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, అంజన్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, సుజిత్‌కుమార్, ఆంజనేయులుగౌడ్, శ్రవణ్ నాయక్, అరుణ్‌కుమార్, అహ్మద్ అలీ, రవీందర్‌రెడ్డి, విక్టర్, ఎజ్రా, ఇమ్రాన్, రాజ్ కుమార్, సర్వర్, తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

కరీంనగర్‌క్రైం: మద్యం సేవించి వాహనం నడిపిన ముగ్గురికి కరీంనగర్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ జైలుశిక్ష, జరిమానా విధించినట్లు కరీంనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. కరీంనగర్‌లో మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన 16 మందిని కోర్టులో హాజరు పర్చగా ముగ్గురికి జైలుతో పాటు జరిమానా, 13 మందికి జరిమానా విధించినట్లు వెల్లడించారు. ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్‌లో ప్రతిరోజూ ప్రత్యేక తనిఖీలు ఉంటాయని పేర్కొన్నారు.

దేశసేవలో 22ఏళ్లు

రిటైర్డ్ జవాన్‌కు ఘనస్వాగతం


శ్రీధర్‌రెడ్డి కుటుంబాన్ని సన్మానించిన గ్రామస్తులు

కరీంనగర్‌రూరల్: జై జవాన్ జై కిసాన్ నినాదాన్ని నిజం చేశాడు ఈ రైతు బిడ్డ. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి దేశసేవ కోసం 19 సంవత్సరాల చిరు ప్రాయంలోనే సైన్యంలో చేరాడు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అరేబియా సముద్రం నుంచి బంగాళాఖాతం వరకు 22 ఏళ్లు సిపాయి నుంచి హవల్దార్ వరకు సేవలందించాడు. ఉద్యోగ విరమణ చేసి బుధవారం రాత్రి స్వగ్రామానికి వచ్చిన ఆర్మీ జవాన్‌కు జయహో జనతా అంటూ గ్రామస్తులు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. పూర్తి వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

కరీంనగర్ మండలం ఎలబోతారం గ్రామానికి చెందిన మారెల్ల మల్లారెడ్డి– సత్యవతి దంపతుల పెద్దకుమారుడు శ్రీధర్‌రెడ్డి డిగ్రీ చదివేటప్పుడే దేశసేవ లక్ష్యంతో 2001లో సైన్యంలో చేరారు. బెంగుళూరు మద్రాస్ టాపర్స్ శిక్షణ కేంద్రంలో రెండేళ్లు శిక్షణ పొందిన అనంతరం మొదటిసారిగా జమ్మూ కాశ్మీర్‌లోని ఉదంపూర్ వెళ్లాడు. అక్కడి నుంచి సర్వీసు ప్రారంభించిన అనంతరం అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, ఢిల్లీలో పనిచేశాడు. వివాహమైన మరుసటి నెలలోనే అత్యంత కఠినమైన రాష్ట్రీయ రైఫిల్స్ విభాగంలో చేరి రెండేళ్లు పనిచేసిన అనంతరం బెంగుళూరు, రాజస్తాన్, పశ్చిమ బెంగాల్, సిక్కిం, పూణే,హిమాచల్ ప్రదేశ్‌లో విధులు నిర్వహించారు. సైనికుడిగా చేరి హవల్దార్‌గా 22 ఏళ్లు సైన్యంలో పనిచేసి గతనెల 30న బెంగుళూరులో రిటైరయ్యారు. బుధవారం రాత్రి ఎలబోతారం వచ్చిన శ్రీధర్‌రెడ్డికి గ్రామస్తులు, కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు ఘనస్వాగతం పలికారు. జాతీయ జెండాలను పట్టుకుని జై జవాన్, జై కిసాన్ అంటూ నినాదాలు చేస్తు శ్రీధర్‌రెడ్డిని ఓపెన్‌టాపు జీపులో ఊరేగించారు. అనంతరం శాలువాలతో సత్కరించి దేశం కోసం శ్రీధర్‌రెడ్డి చేసిన సేవలను పలువురు కొనియాడారు. 22 ఏళ్లు దేశసేవ చేశానని ఇకనుంచి రైతుబిడ్డగా ప్రజాసేవ చేస్తానని శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చల్లా రామక్క లింగారెడ్డి, జయహో జనతా జవాన్ ఫౌండేషన్ ప్రతినిధులు మల్లయ్య, సుధాకర్, వసంత్‌కుమార్, వినోద్, మల్లేశం,చందు, సాగర్,వండర్స్ యూత్ క్లబ్ ప్రతినిధులు, బంధువులు పాల్గొన్నారు.

'బీజేపీపై సీఎంది తప్పుడు ప్రచారం'


సమావేశంలో మాట్లాడుతున్న గంగాడి కృష్ణారెడ్డి

కరీంనగర్‌టౌన్: అగ్రవర్ణాల పేదలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు, చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషను తెచ్చిన బీజేపీపై సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణ, దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి అన్నారు. గురువారం కరీంనగర్‌లోని పార్లమెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అంబేడ్కర్ రాజ్యాంగానికి తూట్లు పొడిచి, దేశంలో ఎమర్జెన్సీ విధించి చీకటి రోజులు తెచ్చిన చరిత్ర కాంగ్రెస్‌కే ఉందన్నారు. అంబేడ్కర్ ఎన్నికల్లో పోటీ చేస్తే ఓడగొట్టిన చరిత్ర కూడా కాంగ్రెస్ దేనన్నారు. బీజేపీ అందరికీ రిజర్వేషన్ల ఫలాలు అందాలనే లక్ష్యంతో పనిచేస్తుందని తెలిపారు. అగ్రవర్ణాలు, బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనారిటీలు బీజేపీకి అండగా ఉన్నారనే అక్కసుతో కాంగ్రెస్ ఆయా వర్గాల మధ్య చిచ్చు పెట్టడానికి కుటిల రాజకీయాలు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు గంద్ర నళిని, బొంతల కళ్యాణ్ చంద్ర, సంపత్, లోకేష్, శ్రీనివాస్, యువ క్రాంతి, శ్రీనివాస్, కొడిమ్యాల రవీందర్ రెడ్డి, రమణారెడ్డి, బండారి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న రాజు

కరీంనగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విశ్వబ్రాహ్మణులకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని విశ్వబ్రాహ్మణ-విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లోజు రాజు కోరారు. గురువారం తీగలగుట్టపల్లిలో జరిగిన జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విశ్వకర్మలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఎన్నికలు ముగిసిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ మంత్రి ప్రభాకర్‌లను కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ సంఘాలకు కార్పొరేషన్లను ఏర్పాటు చేసినప్పటికీ విశ్వబ్రాహ్మణులను విస్మరించిందన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.2వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించి పాలకమండలిని నియమించాలని కోరారు. విశ్వబ్రాహ్మణ చేతి వృత్తిదారులకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలని, ప్రతీ జిల్లా కేంద్రంలో ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటు చేసి వడ్డీలేని రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, కె.హరికృష్ణ, ఎస్.రాజ్‌కుమార్, ఎస్.శ్రీనివాస్, వేణు, రవీంద్రచారీ, ఆంజనేయులు, సత్యనారాయణ, సదానందం, కర్ణాకర్, సదాచారి, బుచ్చయ్యాచారి, బాలకృష్ణమచారి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో లెక్చరర్లు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌లోని ట్రినిటి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఎంబీఏ విద్యార్థులకు కీర్తన ఫిన్సర్వ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ నిర్వహించారు. విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 31 మందిని ఎంపిక చేశారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేంద్రసింగ్, ఏవో రాధాకృష్ణ, ఎంబీఏ హెచ్‌వోడీ, ప్లేస్‌మెంట్ అధికారి సీహెచ్ ప్రవీణ్‌కుమార్, సంతోషి, రజిత, మహ్మద్ ఇలియాజ్ అలీ, అజారుద్దీన్, సుప్రియ, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి శ్రీమద్రామాయణ పారాయణ సహిత మహాక్రతువు

విద్యానగర్: నగరంలోని కొత్త యాస్వాడలో గల పీవీఆర్ హాల్‌లో ఈనెల 4వ తేదీ నుంచి 14వ తేదీ వరకు శ్రీమద్రామాయణ పారాయణ సహిత మహాక్రతువు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. సుందరకాండ శ్లోకాలు, మూలమంత్రాలతో హోమం, కామ్యార్థ పారాయణం శ్రీమద్భాగవతం, శ్రీమహా విష్ణుపురాణం, చతుర్వేదాలు, శ్రీభాష్యం, శ్రీభగవద్విషయం, నాలాయిర దివ్య ప్రబంధం, శ్రీసుదర్శన శతకం, శ్రీమద్భగవద్గీత, శ్రీగుణరత్న శ్లోకం, శ్రీఆళవందార్ స్తోత్రం తదితర కార్యక్రమాలతో పాటు వైదిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

'కుట్ర పూరితంగానే సీఎం రేవంత్ రెడ్డికి నోటీసులు'


మాట్లాడుతున్న రెడ్డి సంఘం నాయకులు

విద్యానగర్(కరీంనగర్): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పెరుగుతున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన అనుకూలమైన ఢిల్లీ పోలీసుల ద్వారా నోటీసులు ఇప్పించిందని తెలంగాణ రెడ్డి సంఘం నాయకులు ఆరోపించారు. గురువారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఏమి లేనందున చెప్పుకోలేక రేవంత్‌రెడ్డిని ఎదుర్కోలేక నోటీసులు ఇప్పించి మానసిక ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. రేవంత్‌రెడ్డికి తెలంగాణ ప్రజలు అండగా ఉంటారని అన్నారు. ఈ సమావేశంలో రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ భూముపల్లి రాఘవరెడ్డి, నాయకులు వంచ సుదర్శన్‌రెడ్డి, నిమ్మ భరత్‌రెడ్డి, చింతల శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, చింతిరెడ్డి రమణారెడ్డి, రవీందర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, గీట్ల ఆనందరెడ్డి, ఈద మధుకర్‌రెడ్డి, రాజిరెడ్డి, సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కే ముదిరాజ్‌ల మద్దతు


మాట్లాడుతున్న గంగాధర కనకయ్య

విద్యానగర్(కరీంనగర్): కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముదిరాజ్‌లను బీసీ–డీ గ్రూప్ నుంచి బీసీ–ఏ గ్రూప్‌కు మార్చేందుకు హామీ ఇచ్చినందున, కాంగ్రెస్ పార్టీకి తమ మద్దతు ప్రకటిస్తున్నట్లు ముదిరాజ్ మహాసభ కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు గంగాధర కనకయ్య తెలిపారు. గురువారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు, ముదిరాజ్‌లకు రాష్ట్ర క్యాబినెట్‌లో స్థానం కల్పించడం. బీసీ కుల గణనకు తీర్మానం చేయడం. రాష్ట్రంలో ఎంపీ సీటు కేటాయించడం, మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల ప్రత్యేక అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడం, ముదిరాజ్ విద్యార్థులకు ప్రత్యేక వసతి గృహం ఏర్పాటుకు హామీ ఇచ్చినందున పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తు కరీంనగర్‌లో ఆ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గెలుపునకు కృషి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ముదిరాజ్ సంఘం నాయకులు మూల జైపాల్, కొమురయ్య, రాజయ్య, మల్లయ్య, రాజయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రాణీరుద్రమకు సిరిసిల్లతో ఏం సంబంధం?


దేవుడి పటంపై ప్రమాణం చేస్తున్న రోహిత్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన రాణీరుద్రమకు సిరిసిల్ల నియోజకవర్గంతో ఏం సంబంధమో బండి సంజయ్ వెల్లడించాలని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేనేని రోహిత్‌రావు డిమాండ్ చేశారు. సిరిసిల్లలో పద్మశాలీ అయిన స్థానికుడు లగిశెట్టి శ్రీనివాస్ ఉండగా, రాణీరుద్రమను ఎందుకు పోటీకి పెట్టాల్సి వచ్చిందో చెప్పాలన్నారు. గురువారం నగరంలోని మైత్రిహోటల్‌లో మాట్లాడుతూ.. తనపై, మంత్రి పొన్నం ప్రభాకర్‌పై రాణీరుద్రమ చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. అవి అవాస్తవమంటూ తన ఇష్టదైవం మల్లికార్జునస్వామి చిత్రపటంపై ప్రమాణం చేశారు. తనతో మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.10కోట్లు ఖర్చు చేయించి, టికెట్ ఇవ్వకుండా మోసం చేశారని చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపట్టారు. పాదయాత్ర పేరిట డబ్బులు వసూలు చేయలేదని బండి సంజయ్ ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు. సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చర్ల పద్మ, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఆకారపు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా.. రాణిరుద్రమ మతిభ్రమించి మాట్లాడుతోందని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి విమర్శించారు. లక్ష్మీ విలాస్ బ్యాంకు నుంచి రూ.18 కోట్ల రుణం తీసుకొని ఎగవేసిన చరిత్ర తనదని ధ్వజమెత్తారు.

గీతాభక్త సమాజం సభ్యుడు బుస్స నర్సయ్య మృతి

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని గణేశ్‌నగర్‌కు చెందిన గీతాభక్త సమాజం సభ్యుడు బుస్స నర్సయ్య (74) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఐటీడీఏలో పనిచేస్తూ ఉట్నూర్‌లో ఉద్యోగ విరమణ పొందిన నర్సయ్యకు భార్య ఇద్దరు కుమారు, ఒక కూతుర్లు ఉన్నారు. గీతాభక్త సమాజం బాధ్యులు బండ సత్తయ్య, పుప్పాల రామేశం, మరియాల రవీందర్, ఆంజనేయులు పార్థీవదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. అనంతరం గీతా విష్ణుసహస్రనామ పారాయణం చేశారు.